విహారయాత్రలతో ఒత్తిడి దూరం



విహారయాత్రలో సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థులు

మల్కాపురం: నిరంతరం చదువు, వివిధ పోటీ పరీక్షలతో ఒత్తిడికి గురయ్యే విద్యార్థులకు ఉపశమనం కలిగించడానికి విహారయాత్రలు ఉపకరిస్తాయని జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులను ఆదివారం నగరంలోని పలు పర్యాటక ప్రదేశాలకు తీసుకెళ్లారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యా సంస్థ తమ విద్యార్థులను విహారయాత్రలకు తీసుకువెళ్లాలన్నారు. ఇలాంటి యాత్రలు వారిని ఉల్లాస పరుస్తాయని.. తద్వారా సంతోషం పొందుతారన్నారు. ఆ ఉత్సాహంతో ఒత్తిడి మరిచి కార్యాచరణకు ఉపక్రమిస్తారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి పాల్గొన్నారు.

ఫ్యూజ్ బాక్స్‌లో అమర్చిన విద్యుత్ వైర్లు



విద్యుత్ వైర్లను బాక్స్‌లో అమర్చిన దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి వద్ద గల విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న విద్యుత్ వైర్ల పై ఆదివారం పొంచి ఉన్న ప్రమాదం శీర్షికతో 'సాక్షి' దిన పత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మల్కాపురం ఏపీఈపీడీసీఎల్ (మల్కాపురం సబ్‌స్టేషన్)ఏఈ పిచ్చయ్య ఆదివారం ఆ ప్రాంతానికి వెళ్లి తన సిబ్బంది సాయంతో వేలాడుతున్న వైర్లను ప్లాస్టిక్ బాక్స్‌లో అమర్చారు. ఆ బాక్స్ ఎవరూ తెరవకుండా దానికి సీల్ వేశారు. దీంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

వృద్ధులకు భోజనాల పంపిణీ



భోజనాలు వడ్డిస్తున్న చెల్లూరి

మల్కాపురం: ప్రముఖ చిత్రకారుడు, సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కరరావు ఆదివారం వృద్ధులు, దివ్యాంగులకు భోజనాలు పంపిణీ చేశారు. స్థానిక వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న 80 మందికి భోజనాలు స్వయంగా వడ్డించారు. అనంతరం ఆయన దివ్యాంగులకు ఆహారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా తన సొంత నిధులతో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు.

మల్కాపురంలో రచ్చబండ నిర్వహణ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జాలరివీధి మర్రిచెట్టు కింద టీడీపీ నాయకుడు కాకి పోలిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ అర్హత ఉన్నా ప్రభుత్వ పథకాలు అందకపోతే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్, సర్వసిద్ధి శ్రీలక్ష్మీయాదవ్, తదితరులు పాల్గొన్నారు.


14న పైడిమాంబ అమ్మవారి పండగ



ఆలయ ప్రాంగణంలో సమావేశమైన పెద్దలు

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెం గ్రామ దేవత పైడి మాంబ అమ్మవారి పండగను ఈ నెల 14న నిర్వహించాలని గ్రామస్తులు నిర్ణయించారు. ఈ మేరకు ఆలయ ఈవో కీర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ పెద్దలు సమావేశమయ్యారు. ఏటా ఫిబ్రవరి రెండో మంగళవారం పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆ మేరకు ఈ నెల 14న పండగ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో గ్రామ పెద్దలు పూరెడ్డి ప్రకాష్ రెడ్డి, మళ్ల అప్పారావు, యల్లపు వెంకటేశ్వరరావు, సతీష్, వలిరెడ్డి శ్రీనివాసరావు, గులమజ్జి సుబ్రహ్మణ్యం, నమ్మి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో సర్వీసు రోడ్డు



అంధకారంలో ఉన్న మరడిమాంబ ఆలయ వెనుక మార్గం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ ఆలయం వెనుక ఉన్న రోడ్డులో సుమారు ఆరు ఎల్ఈడీ లైట్లు వెలగడం లేదు. దీంతో ఆ మార్గంలో అంధకారం అలుముకుంది. సమస్యను స్థానికులు జీవీఎంసీ ఎలక్ట్రికల్ అధికారులకు ఫిర్యాదు చేసినా నేటికీ స్పందన లేదు. సాయంత్రమైతే ఈ మార్గంలో అంధకారం అలుముకోవడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యపై స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏఐవైఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

సింహాచలం: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)పెందుర్తి ఏరియా నూతన కమిటీ ఎన్నిక ఆదివారం సుజాతనగర్‌లోని భగత్‌సింగ్ భవన్‌లో జరిగింది. అధ్యక్షుడిగా ఆర్.పవన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా వి.సురేష్, వై.సాయి, కార్యదర్శిగా ఎస్.లక్ష్మీనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా ఎ.దుర్గాప్రసాద్, సుబ్బు, కోశాధికారిగా ఎం.రాజు, మరో ఆరుగురు సభ్యులను ఎన్నుకున్నారు.

క్షణికావేశంలో వ్యక్తి ఆత్మహత్య



నవీన్ (ఫైల్)

గోపాలపట్నం: క్షణికావేశంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుని కుటుంబ సభ్యులకు శోకం మిగిల్చిన ఘటన గోపాలపట్నం లక్ష్మీనగర్ ఈ బ్లాక్ నాలుగు కుళాయిల వద్ద చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ ముగ్దంపురం గ్రామానికి చెందిన ముత్యం నవీన్(23) మద్యం మత్తులో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. నవీన్ నగరంలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి పని పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాడు. రాత్రి 1గంట సమయంలో వేరే మహిళతో మాట్లాడాల్సిన అవసరమేంటని భార్య నాగమణి నిలదీసింది. దీంతో ఇద్దరి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. ఆ తర్వాత భోజనం తీసుకువచ్చేందుకు సమీపంలో ఉన్న తల్లి ఇంటికి నాగమణి వెళ్లింది. తిరిగి వచ్చే సరికి తలుపులు వేసి ఉండడంతో తీయమని కొట్టింది. ఎంతకీ తీయక పోవడంతో స్థానికుల సాయంతో ఇంటి వెనుక తలుపులు తెరిచి లోపలికి వెళ్లి చూసే సరికి ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో వెంటనే కిందకు దించి గోపాలపట్నం 30 పడకల ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు గోపాలపట్నం పోలీసులకు సమాచారమందించారు.

మూడేళ్ల కిందట వివాహం

కాగా నవీన్ లక్ష్మీనగర్‌కు చెందిన నాగమణిని ప్రేమించి మూడేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. కొన్నాళ్లు సొంత ఊర్లో ఉండే వాడు. ఏడాది కిందటే లక్ష్మీనగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసముంటున్నారు. వీరికి ఇంకా పిల్లలు లేరు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పబ్లిక్ డిమాండ్

పందుల సమస్యకు పరిష్కారం చూపరా?



రామ్‌నగర్ ప్రాంతంలో సంచరిస్తున్న పందులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు రామ్‌నగర్ గెడ్డ ప్రాంతంలో పందుల సంచారం ఇటీవల అధికమైంది. గెడ్డలో సంచరించి వ్యర్థాలను భుజించే పందులు సమీప నివాసాల వద్దకు వచ్చి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. దీనిపై అధికారుల వద్ద సమాచారం ఉన్న వారు స్పందించడం లేదు.

– పి.శ్రీనివాసరావు (రామ్‌నగర్)

వైభవంగా మహా మాఘీ ఉత్సవాలు



పూజలందుకున్న సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి



ఖడ్గమాల దేవతలను అభిషేకించేందుకు కలశాలతో పవిత్ర జలాలు తీసుకువెళ్తున్న ఆహుతులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో మహా మాఘీ ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజులుగా దక్షవాటిలో చండీ పారాయణ, సహస్ర చండీ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పవిత్రీకరించిన 116 కలశాల్లోని పవిత్ర జలాలను ఆహుతులైన భక్తులంతా దేవీపురంలో శ్రీయంత్ర మహామేరు నిలయంలోని 108 ఖడ్గమాల దేవతలకు అభిషేకించారు. అదేవిధంగా పౌర్ణమి సందర్భంగా సహస్రాక్షి అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం 11 గంటల వరకూ నిర్వహించిన పూర్ణాభిషేకంలో అధిక సంఖ్యలో సాదకులు పాల్గొన్నారు. అనంతరం గురుమాత అన్నపూర్ణమ్మతో పాటు గురూజీ చైతన్యానంద సరస్వతి ఆశీర్వాదం పొందడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నట్లు కెనడాకు చెందిన రమేష్ నటరాజన్ తెలియజేశారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు పవన్, శ్రావణ్, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టంప జేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

బౌద్ధాలయంలో పౌర్ణమి పూజలు



చీరలు అందిస్తున్న బౌద్ధ సమాజం సభ్యులు

కంచరపాలెం: స్థానిక అశోక్‌నగర్ బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో ఆదివారం బుద్ధుడికి మాఘ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర బౌద్ధ సమాజ వ్యవస్థాపకుడు మల్లారపు అర్జున్‌రావుకు నివాళులర్పించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్.బాబూరావు, రాజు, భీమారావు, సూరిబాబు, రాము, రామచంద్రరావు, పరిమళ, సునీల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్స్ హెచ్‌ఎంల ఆత్మీయ కలయిక



ఆత్మీయ కలయికలో ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు

కంచరపాలెం: ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జె.సోమశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం కంబాలకొండలో ప్రైవేటు స్కూళ్ల హెచ్‌ఎంలు, కరస్పాండెంట్లు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రైవేటు స్కూళ్ల ఐక్యతను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ ఏడాదిలో అత్యధిక పాఠశాలలు సభ్యత్వ నమోదుకు ముందుకు రావాలని సోమశేఖర్ కోరారు. మధ్యాహ్నం విందు, వినోదాలతో నూతన ఏడాది సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల సభ్యులు పాల్గొన్నారు.

భారతీయ ప్రాచీన వేదాల విజ్ఞానం ఆచరణాత్మకం

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ
- కొనసాగిన శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు



ప్రవచిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ



పాల్గొన్న భక్తులు

ఎంవీపీకాలనీ: భారతీయ ప్రాచీన వేదాలు అత్యంత సుస్థిర, ఆచరణాత్మకమైనవని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని ఏబీసీ పార్కులో నిర్వహిస్తున్న శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ ప్రాచీన వేదాల్లో సుస్థిరమైన విజ్ఞానం దాగి ఉందన్నారు. నేటి ఆధునిక యుగంలోని శాస్త్రవేత్తలు సైతం దీన్ని ధ్రువీకరించడం అభినందనీయమన్నారు. దాన్ని వెలికి తీసి పాటించడం ద్వారా ప్రశాంతమైన జీవనం సాధ్యమవుతుందన్నారు. వేదాల విజ్ఞానం ఆధునిక సమాజానికి సైతం మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు. కేవీఎస్ శ్యామ్, అరుణగాయత్రి దంపతుల నేతృత్వంలో నిర్వాకులు వీవీ ఆదినారాయణ, దొంతకుర్తి శ్రీనివాస్‌లు యాగాది క్రతువులు, ప్రత్యేక విశేష పూజలు నిర్వహించారు. ఈ నెల 12వ తేదీ వరకు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ ప్రవచనాలతో పాటు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను జరుగుతాయని శ్రీమాత భక్త బృందం సభ్యులు తెలిపారు. ఈ ప్రవచనాల కార్యక్రమంలో 1000 మందికి పైగా నగర భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫిట్‌నెస్ పాదయాత్ర



హెల్త్‌వాక్‌లో పాల్గొన్న నేవీ సిబ్బంది, కుటుంబసభ్యులు

సింథియా: ఐఎన్ఎస్ విర్భాహు వద్ద ఫిట్‌నెస్ పాదయాత్రను ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. హెల్త్‌వాక్‌లో సుమారు 150 మంది నేవీ సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. డాల్ఫిన్ స్పోర్ట్సు మైదానం నుంచి ఐఎన్ఎస్ విర్భాహు వరకు 6 కిలోమీటర్లు సాగిన నడక యాత్ర హాస్య యోగాతో ముగిసింది.

27, 28 తేదీల్లో రేణుక యల్లమ్మ జాతర



కర్రి నీలకంఠాన్ని సత్కరిస్తున్న పీలా వెంకట అప్పలనాయుడు తదితరులు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి 23వ జాతర మహోత్సవాలు ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు అధ్యక్షతన కార్యవర్గ సభ్యులు సమావేశం నిర్వహించారు. కమిటీ ముఖ్య సలహాదారుగా వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్‌ను నియమించారు. జాయింట్ సెక్రటరీగా బడే నాగరాజును నియమిస్తూ తీర్మానించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఏర్పాట్లు, ఉత్సవాల నిర్వహణపై కమిటీ సభ్యులు చర్చించారు.

కర్రి నీలకంఠంకు సన్మానం..

జీవీఎంసీ 33, 34, 35, 41 వార్డులకు గాను వైఎస్సార్‌సీపీ తరఫున అధ్యక్షుడిగా నియమితుడైన రేణుక యల్లమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి నీలకంఠంను పీల వెంకట అప్పలనాయుడు, కమిటీ సభ్యులు గజమాలతో సత్కరించారు.

యల్లమ్మతల్లికి మొక్కుల సమర్పణ..

రేణుక యల్లమ్మ జాతర సందర్భంగా విశాఖ వాసుల ఆరాధ్య దైవం యల్లమ్మతోట యల్లమ్మ వారికి ఉత్సవ సంకల్పాన్ని కమిటీ సభ్యులు తెలియజేశారు. అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకమలు సమర్పించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొడ్డు పోలరావు, వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్, డి.సత్యనారాయణ, జి.సత్యవతి, ఆలయ అర్చకుడు కొడమంచిలి కామేశ్వరశర్మ పాల్గొన్నారు.

వేడుకగా కలశ ప్రతిష్ట



రాజగోపురాలపై కలశ ప్రతిష్ట చేస్తున్న అర్చకుడు రామానుజమ్

సింహాచలం: చినముషిడివాడలోని అలివేలు మంగమ్మ ఆలయంలో కొత్తగా నిర్మించిన తూర్పు, ఉత్తర రాజగోపుర రాజగోపురాల ప్రతిష్ట ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి యాగశాలార్చన, విశేష హోమాలు, మహాపూర్ణాహుతి, రాజగోపురాలపై కలశ ప్రతిష్ట, కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.

ముగిసిన సీబీఎస్ఈ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు

ఆరిలోవ: విద్యార్థులకు ఆరోగ్యకరమైన విద్యాబోధన కోసం విశాఖ వేలీ స్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన 'సీబీఎస్ఈ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం'కార్యక్రమం ఆదివారం ముగిసింది. నగరంలో 30 సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన 80 మంది ఉపాధ్యాయులు ఈ వర్క్ షాపులో పాల్గొన్నారు. ఆదివారం రిసోర్స్ పర్సన్‌గా విశాఖవేలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ వ్యవహరించారు. ఇనీషియల్ మెంటల్ హెల్త్, గ్రోయింగ్ ఆఫ్ హెల్త్, న్యూట్రిషియన్ హెల్త్, శానిటేషన్, ప్రివెన్సన్ అండ్ మేనేజ్‌మెంట్ సస్టయినబుల్, రీ ప్రొడక్ట్ ఆఫ్ హెల్త్, తదితర వాటి గురించి అవగాహన కల్పించినట్టు ఆమె తెలిపారు. ఇవి ఉపాధ్యాయులు, విద్యార్థులు శారీరక, మానసిక, సామాజికంగా ఆరోగ్యంగా ఉండడానికి ఉపయోగపడతాయన్నారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు 70 మంది ఎంపిక



జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికన వారితో జానకీరామ్

మహారాణిపేట: న్యూఢిల్లీలోని తలకట్టోర ఇండోర్ స్టేడియంలో ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు 70 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. న్యూ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం ఎంపిక పోటీలు నిర్వహించారు. జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి 70 మంది ఎంపిక కాగా.. ఇందులో 50 మంది విశాఖ క్రీడాకారులే కావడం విశేషం. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏపీ మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ పాల్గొని.. ఎంపికైన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ రాజధానిలో పతకాలు సాధించి.. రాష్ట్ర ప్రతిష్ఠను మరింతగా ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఎంపిక పోటీలకు జి.నూకరాజు, డి.ప్రేమ్‌కుమార్, ఎస్.సతీష్ కుమార్, ఎస్.నరేష్, శంకర్, ఎర్రయ్య, శ్రీనివాస్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కోచ్ జి.గోవింద్, టీమ్ మేనేజర్ చంద్రశేఖర్, అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.నూకరాజు ఎంపికైన వారిని అభినందించారు.

'ఉక్కు పోరు ఆపేదే లేదు'

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మికుల ఉద్యమానికి విలువనిచ్చి ప్రైవేటీకరణ అంశాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉక్కు పోరాటాన్ని విరమించేదిలేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. 724వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో కాంట్రాక్ట్ కార్మికులు, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీక్షలో పాల్గొన్న కార్మికులను ద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్రంలో పాటు ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం ప్రైవేటీకరణలో భాగంగా కేంద్రానికి సహకరిస్తూ ఒక్కొక్క అడుగు ముందుకు వేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని, వీరి ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని రాష్ట్ర ప్రజలు మరియు సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు కోరుతున్నారని, ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రానికి ఈ ప్రాంత ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సేవ్ పబ్లిక్ సెక్టార్- సేవ్ ఇండియా పేరుతో అన్ని పరిశ్రమల కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఉక్కు ఉద్యమానికి 700 రోజులు గడిచినా కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదని, కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ఎందుకు ఇంత చిన్నచూపు చూస్తోందో అర్థం కావడం లేదన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు

కంచరపాలెం: ఏపీఈపీడీసీఎల్ జోన్-2 డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ, సంస్థ జోన్-2 ఈఈ బి.కోటేశ్వరనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కంచరపాలెం రామ్మూర్తి పంతులుపేట జోన్-2 ఏపీఈపీడీసీఎల్ డివిజిన్ కార్యాలయంలో వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చు తగ్గులు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లుల్లో పేరు మార్పు, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు తదితర సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ సదస్సులో పాల్గొనాలని కోరారు.

సీనియర్ సిటజన్స్‌కు సత్కారం

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు సుజాతనగర్‌లోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని సీనియర్ సిటిజన్లు మంగిపూడి సత్య జగన్నాథరావు, శ్రీపాదం ఆనందరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె.సన్యాసిరావు, కార్యదర్శి జి.నరేంద్ర, కోశాధికారి వి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.